# వెక్కిరిస్తున్న ప్రతిబింబాలు

**చెల్లి**

అంతులేని ఆలోచనల కదలికలా ఆయాసంగా అడుగులు వేస్తూ నడుస్తోంది ఇందిర. అరిగిపోయిన రోడ్డుమీద సూదుల్లా మొలచి నిలుచున్న కంకర్రాళ్ళు ఆమె పాదాలను కసితీరా కరుస్తున్నాయి. తన అగమ్యమైన భవిష్యత్తు గురించి ఆలోచనలు ఆమెను పీడిస్తున్నాయి.

చనిపోయిన తల్లి తన జీవితానికి 'సారె'గా వదిలిపెట్టిన ఒక్క తెల్ల సిల్కు చీర ఆ రోజు ఉపయోగానికి వచ్చింది ఇందివరకు. ఆ చీర కట్టుకుని తలలో చామంతులు ముడుచుకుని బయలుదేరింది.

తన జీవితంలో ఉద్యోగం చెయ్యవలసి వస్తుందని ఆమె చిన్నతనంలో ఎప్పుడూ అనుకోలేదు. ఇప్పుడు ఆ ప్రయత్నంలో ఆమె చూపిస్తున్న పురోగమనం, ధైర్యం ఆమెకే ఆశ్చర్యం కలిగించాయి. పరిస్థితుల ప్రభావంతో మనిషి ఏ పని ఐనా చెయ్యడానికి వెనుదీయడనే నిర్ధారణకు ఆమె వచ్చింది.

రోడ్డు మళ్ళి, బస్సుస్టాండు వైపు బజారులోంచి ఇందిర నడిచింది. దుకాణాలన్నీ తెరచి ఉన్నాయి. జనం ఎవరి గొడవలో వాళ్ళు మీటనొక్కిన బొమ్మల్లా నడిచిపోతున్నారు. హోటళ్ళల్లో జేబులు ఖాళీ చేసుకుని సగం నింపుకున్న కడుపుకు ఉపశమనంగా సిగరెట్టు దుమ్ములు నిర్విచారంగా పీలుస్తూ బయటికి వస్తున్నారు కొందరు నిర్భాగ్యులు. తల మర్దనాలు చేసే మంగళ్ళు, బూట్లు పాలిష్ చేసే కుర్రాళ్ళు, కారపు బజ్జీలు అమ్మే కోమట్లు హడావిడిగా వచ్చే వెళ్ళే జనాన్ని పరామర్శిస్తూ తిరుగుతున్నారు.

అదృష్టం రాల్చే పైసలతో దినదిన గండం లాంటి జీవితాలలో సుఖం వెతుక్కుంటూ బ్రతుకుతున్న ఆ కష్టజీవులకూ తనకూ ఒక్కటే తేడా కనిపించింది ఇందిరకు. కుటుంబ గౌరవాలు, సంఘ మర్యాదలు తెగతెంపులు చేసుకున్నట్లయితే తానుకూడా అంత విచ్చలవిడిగా ఉండవచ్చు. కాని అది ఒక్కటే సారిగా సాధ్యం కాకపోవడంవల్ల తన బ్రతుకు ఆ కష్టజీవుల కంటే చాలా బాధాకరంగా కనిపించింది.

పెరిగిపోతున్న జనాభా మధ్య అదృష్టం అవకాశాలకోసం క్యూలో నుంచున్నట్లు కాళ్ళు పీకేటంతకాలం నుంచున్నాక, వచ్చిన బస్సు ఎక్కి గమ్యస్థానం చేరుకుంది ఇందిర.

జమీందారుగారి బంగళా గేట్లు తెరిచివున్నాయి. బొచ్చు కుక్కను దువ్వుతూ, బొద్దు మీసాలతో, ఠీవిగా లవుపాటిచుట్టను కాలుస్తూ ఆయన సోఫాలో కూర్చున్నారు.

ఇందిర జమీందారుగారికి నమస్కరించింది.

విద్యుద్దీపం చుట్టూ తిరిగే పురుగుల్లా, ఆయన కళ్ళు ఆమె చుట్టూ అనేక ప్రదక్షిణాలు చేశాయి.

"శేషయ్యగారు పంపించారండి"

"మీ పేరు?"

"ఇందిర."

"మంచిది. రేపు ఉద్యోగంలో చేరండి. ఎనభై రూపాయిలిస్తాను."

"తమ దయ."

ఉప్పొంగిపోయే అనందంతో, పరిపూర్ణ పవిత్రతతో జమీందారు గారికి మరొక నమస్కారం పెట్టింది ఇందిర. ప్రొద్దున బయలుదేరిన శకునం, వేళా విశేషం, శేషయ్యగారి పలుకుబడి మహిమ వీటిలోని ప్రత్యేకతల గురించి ఆలోచించుకుంటూ గబగబ ఇంటికి వచ్చేసింది.

ఇంట్లో అడుగు పెట్టగానే ఖంగు ఖంగుమనే తండ్రి దగ్గు వినిపించగా, ఇందిర తన ఆనందంలోంచి తేరుకుంది. తండ్రికి, అన్నయ్యకు తాను ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేదు. కాని ఇంట్లో ఇబ్బందిగా ఉంటే ఏదో మార్గం చూచుకోకపోతే ఎలాగ? తన తండ్రి స్నేహితుడు శేషయ్య గారు మంచివాడు కనుక తనకీ సహాయం చేశాడు. అన్నయ్య తనకంటే ఎక్కువ చదివినా ఉద్యోగం దొరకడం కష్టమైపోతూంది. రోజుల మార్పులో వింతలు తలుచుకుంటూ గుమ్మంలో అడుగు పెట్టింది ఇందిర.

'ఎక్కడికెళ్ళావమ్మా?' దగ్గుతూ ప్రశ్నించాడు తండ్రి.

'జమీందారుగారి దగ్గరకు. ఉద్యోగం యిచ్చారు. ఎనభై రూపాయలు జీతం'.

ఏదో సమాధానం చెప్పబోతూ, తుఫానులా విసురుతో వచ్చిన దగ్గుతో క్రుంగిపోయారు రామయ్యగారు.

'ఎందుకమ్మా నీకీ శ్రమ? నే నెక్కడో ఒక ఉద్యోగం సంపాదించేవాణ్ణిగా?' అన్న కామేశం మామూలుధోరణిలో ఇందిరను అనునయించాడు.

రోగిష్ఠి తండ్రి. నిరుద్యోగి అన్న, ఎదుగుతూ అభివృద్ధికి రావలసిన చెల్లెళ్ళు ఇంట్లో వుంటే, పైస ఆదాయం లేకుండా కుటుంబం ఎంతకాలం గడుస్తుంది? తండ్రికి వచ్చే పాతిక రూపాయల పెన్షన్ ఆయన మందులకే చాలటంలేదు. ఇప్పటికే చాలా అప్పులు పెరిగిపోయాయి. ఈ పరిస్థితులలో తనకి ఇంత సులువుగా ఉద్యోగం రావడం చాల శుభసూచకమని సంతోషించింది ఇందిర.

## తండ్రి

రామయ్యగారు నులక వ్రేళ్ళాడుతున్న మంచంమీద పడుకుని ఉపద్రవమైన దగ్గుతో శరీరాన్ని కుదుపుకుంటూ బాధ పడుతున్నారు. ఆయన జీవితంలో మొదట ముప్ఫై రూపాయిల గుమాస్తాగా చేరి చివరకు వంద రూపాయిల గుమాస్తాగా రిటైరయ్యారు. రాత్రింబవళ్ళు పని చేసి శరీరంలోని ప్రతి రక్తబిందువు ఆఫీసు కాగితాలలోని కరక్కాయసిరా అక్షరాలచే వానికి ధారపోసి ఎముకల పిప్పిగా తయారయి, పాతిక రూపాయిల పెన్షన్‌తో ఆఫీసునుంచి బయట పడ్డారు. తన జీవిత చరిత్రపుటలు తిరగవేస్తే, రామయ్యగారికి పురోభివృద్ధి అటుంచి, జీవితమంతా ఒక జయప్రదమయిన అథోగతిలా తోచింది కొడుకుకు ఇంటరుదాకా, కూతురుకు పదవక్లాసుదాకా చదువు చెప్పించేటప్పటికే ఆయన శక్తి ఉడిగిపోయింది. తన భార్య పోయాక పెద్దకూతురే తనకి, తన కుటుంబానికి ఒక గృహలక్ష్మిగా ఆదుకోవలసిన అగత్యం పట్టింది. పిల్లలకు పెళ్ళిళ్ళు, తీర్చవలసిన ముచ్చట్లు అన్నీ రామయ్యగారికి తీరని కోరికలుగా నిలిచిపోయాయి.

ఇవన్నీ ఆలోచించుకుంటూ ఉబ్బస రోగంతో తన కుటుంబానికి ఒక పెద్ద బరువుగా మాత్రం ఉండిపోయారు రామయ్యగారు.

## అన్న

కామేశం తన సంగతి ఆలోచించుకుంటూంటే, ఎప్పుడో మతి పోతుందేమో అన్న భయం అతనికే కల్గుతూండేది. ఏదో పెద్ద చదువులు చదువుకోవాలనే తియ్యని కోరికలు చిన్నతనంలో పెంచుకున్నవి పూర్తిగా మాడిపోయాయి. యిప్పుడు ప్రస్తుత ఆదాయంతో రోజు గడవడమే కష్టమైపోతూంది. మానవ ప్రయత్నం నిత్యం విఫలమై

పోతూంటే, ఇది యింక అనవసరమని అదోవిధంగా బాధతో, హఠాత్తుగా ఏదో అదృష్టం ఎప్పుడో వస్తుందని ఆశతో బ్రతకడం నేర్చాడు కామేశం. ఎంత బాధ పడుతున్నా నవ్వటమే అలవాటు చేసుకున్నాడు. కష్టాలు ఎక్కువైనప్పుడు మరీ ఖులాసాగా ఉండడానికి ప్రయత్నించసాగాడు. పరిష్కారాలు సాధ్యం కాని జీవితంలోని ఆర్థిక సమస్యలు చూస్తూంటే, అగ్నిలా రగుల్కొని ఒక్కొక్కసారి అతని మనస్సు విప్లవంతో పరవళ్ళు త్రొక్కేది. మంచిగా బ్రతకడానికి సంఘం ఆస్కారం యివ్వకపోతే ఆ మంచే చెడుగా మారవచ్చనే సిద్ధాంతం జీర్ణించుకున్నాడు కామేశం. తన అదృష్టం, అవకాశాలు ఏవిధంగా లభిస్తాయనే తల్లక్రిందుల తపస్సు మొదలుపెట్టాడు అతను.

## చెల్లి

ఇందిరకు పెరిగిన బాధ్యతలతో శారీరక,మానసిక శ్రమ హెచ్చయింది. ఇంటిదగ్గర వంట, రోగిష్టి తండ్రికి సేవ, చెల్లెళ్ళకు చాకిరీ, జమీందారుగారి దగ్గర ఉద్యోగం... ఇవన్నీ అయిదు నిమిషాలు హాయిగా గాలి పీల్చుకోడానికి కూడా అవకాశం లేకుండా చేశాయి ఇందిరకు. ప్రొద్దున్న తొమ్మిది గంటలకు వెళ్ళిన ఇందిరకు సాయంత్రం ఆరుగంటలదాకా జమీందారుగారు ఏదో పని పురమాయిస్తూ, ఆమెకు చేతినిండా పని కల్పించసాగారు. రోజులు గడిచినకొలదీ జమీందారుగారు చిలిపి నవ్వులు, పరిహాసాలు, చనువు సంభాషణలు ప్రదర్శిస్తున్నారు. ఒక కంటితో ఆయన ప్రవర్తన ప్రత్యేకంగా గమనిస్తున్న ఇందిరకు లోలోపల భయం కల్గుతూంది. ఉద్యోగం మానడం ఆమెకు ఇష్టం లేకపోయింది. తన జాగ్రత్తలో తానుంటే పరిస్థితులు సర్దుకో వచ్చునని ఆశించింది.

## అన్న

ఎక్కడ ప్రయత్నించినా ఏ ఉద్యోగం తనకు దొరకకపోవడం వల్ల, తన చెల్లెలుకన్న హీనమయిన బ్రతుకుగా తనది మారిపోయిందని వాపోయాడు కామేశం. ఒక అబల ఉద్యోగం సంపాదించి తనలాటి సబలుల నెందరినో పోషిస్తూంటే తన మగతనానికే దెబ్బ తగిలినట్లు భావించాడు అతను. ఏదో విధంగా ఎక్కడో పదిరాళ్ళు సంపాదించాలనే ఆత్రుత ఎక్కువైపోయింది కామేశానికి. డబ్బున్న సేట్లు- కారుల్లో పోయే ధనికులు- మిఠాయిలు తినే భోగులు - సినీమాలకు పోయే ఖులాసా పురుషులు - వీళ్ళందర్నీ చూస్తూంటే, తన సుఖాన్ని కాజేసి ఆనందిస్తున్న దుర్మార్గులుగా కామేశం కళ్ళకు కనిపించేవారు. దుకాణదారులు తమ గళ్ళాపెట్టి సర్దుకుంటున్నప్పుడు,

ఉద్యోగులు 1వ తారీఖున లావెక్కిన తమ పర్సులు విప్పుకుంటున్నప్పుడు, బ్యాంకుల్లో ప్రజలు డబ్బు దాస్తున్నప్పుడు కామేశానికి ఏవో క్రొత్త ఆలోచనలు కలిగేవి. తన చితికిన ఆర్థికస్థితి, ఆశయాలు, ఆశలను భగ్నం చెయ్యడమే కాకుండా, అలా జరగడానికి కారకులైన చుట్టూ ఉన్న ధనికులపై దండయాత్రలు చెయ్యాలనే రోషం పెంచుతోంది అతనికి. చివరకు ఏమీ చెయ్యలేక ఒక బట్టల మిల్లులో తప్పనిసరిగా ఒక కార్మికుడుగా రోజు కూలికోసం చేరాడు.

## తండ్రి

రామయ్యగారు ఆఖరి దినాలలో అవస్థల పాలైన రోగిష్టి బ్రతుకు బ్రతుకుతున్నా సహజమైన సంకుచిత స్వభావం ఆయన్ని విడవలేదు. ఇందిర ఇంటి చాకిరీతో పడుతున్న కష్టాలకు సానుభూతి చూపిస్తున్నా, ఆయన చాకిరీ వచ్చేటప్పటికి ఆ సానుభూతి మరిచి, నిత్యం ఎవరో ఒకరు తన ప్రక్కన ఉండి మందులు అందిస్తూంటేగాని ఆయనకు సంతృప్తి కల్గటం లేదు. పగలు, రాత్రి పనితో ఒళ్ళు హూనమయిన ఇందిరకు హాయిగా ఒక కునుకు రాకముందే, రామయ్యగారికి ఇంటికప్పు ఎగిరిపోయేటంత దగ్గు రావడం, ఆయన గుండెలు నిమరడానికి ఇందిర లేవడం, రోజూ పరిపాటి అయిపోయింది. ఒకసారి వేడినీళ్ళు, మరొకసారి ఔషధం, ఇంకొకసారి ఇంకొకటి - ఈ పనులతో నిద్ర లేకుండా, ఉన్న కాస్త రాత్రి హరించుకుపోయేది. కూతురు ఇందిర మీద ఎంత అభిమానమున్నా పురాతన కాలపు రామయ్యగారు తన చాదస్తం వల్ల ఆమె బాధలు ఎక్కువ చేస్తున్నారు.

## చెల్లి

ఇంట్లోను బయట పనులు పూర్తయ్యాక దొరికిన కొద్ది నిమిషాల విరామంలో స్వగతంగా స్వీయచరిత్ర అప్పుడప్పుడు పరామర్శించుకోడం ఇందిరకు అలవాటు, తనకు వయస్సు వచ్చింది. బీదరికం కొన్ని అందాల పోషణకు ఆటంకం కలిగిస్తున్నా, వయసులోని అందమైన స్త్రీలకు తనే విధంగా తీసిపోదు. తండ్రి జీవితం ఆఖరు దినాలలో ఉన్నాడు. అన్నయ్య ఉద్యోగం దొరకని అవస్థలో ఉన్నాడు. తన స్నేహితురాండ్రకు ఎంతమందికో పెళ్ళిళ్ళయి భర్తలతో హాయిగా కాపురం చేస్తున్నారు. చిలకా గోరింకల్లాంటి కొందరు దంపతులను చూస్తూంటే తనకా భాగ్యం, ఎప్పుడు కల్గుతుందనే ఆశలు గాలి బుడగల్లా ఆమె ఆలోచనల్లో తేలి చితికిపోతుండేవి.

ఆడది ఉద్యోగం చేస్తూంటే అందరికీ హేళనే! జమీందారు దగ్గర ఉద్యోగంలో చేరాక, ఎంతోమంది తన్ను గురించి ఎన్నో విధాల అనుకుంటున్నారు. స్త్రీ పురుషుడు దగ్గర పని చేసినా, పురుషుడు స్త్రీ దగ్గర పనిచేసినా సంఘానికి ఒక్క స్త్రీ పురుష సంపర్క దృష్టి తప్ప, మరొక విధమైన హృదయ సంబంధాలు అవసరమున్నట్లు కనిపించదు. ధైర్యంగా ఎవరి జీవితాన్ని వారు తమ పరిస్థితుల ననుసరించి సరిదిద్దుకోవాలని నల్గురూ మాట్లాడే మాటలను ఆధారం చేసుకుని బ్రతకడం చాలా కష్టం. భావి జీవితాన్ని అల్లుకుంటున్న ఏవో కలలతో కళ్ళు మూసేది ఇందిర, తండ్రి ఖంగు ఖంగుమని దగ్గుతూ తనను పిల్చేదాకా. బట్టల మిల్లు పనిలో చేరాక, కామేశం తోడి కార్మికుల కష్ట జీవితాలు బాగా అవగాహన చేసుకునే అవకాశం కల్గింది. తన కుటుంబ కష్టాలకంటే, ఎక్కువ కష్టాలు పడుతున్న కార్మికులు అతని హృదయాన్ని కరగించేవారు. రాత్రి భోజనం లేకుండా పనిలోకి వచ్చేవాడు. చలిలో బట్ట లేకుండా గజగజా వణికిపోయేవాడు. తెచ్చిన డబ్బంతా భర్త త్రాగుడుకు ఖర్చుపెట్టగా, కుటుంబం ఆకలి తీరుద్దామని బలవంతంగా పనిలో చేరడానికి వచ్చిన ముసలి ముత్తయిదువ, కాళ్ళు, చేతులు మిల్లు చక్రాలకు బలికాగా, నష్టపరిహారం కోసం ఆఫీసులచుట్టూ ప్రదక్షిణాలు చేసేవాళ్ళు. అనేకమంది నిత్యం అతనికి రామాయణాల్లాంటి తమ పెద్ద జీవిత చరిత్రలు వల్లించసాగారు. కామేశానికి చుట్టూవున్న అన్యాయాలు చూస్తూంటే ప్రతీ రక్తకణం ఉడికిపోయేది కాని అతని పరిస్థితులు అతని చేతులు కట్టేసేవి.

## త్రయం

మూల్గుతున్న రామయ్యగారు ఒకరోజు హఠాత్తుగా కళ్ళు మూసారు. జమీందారుగారింట్లో ఉన్న ఇందిర, మిల్లులో ఉన్న కామేశం ఈ వార్త ఎవరో సానుభూతిపరుడు చెవిని వేస్తే పరుగెత్తుకుంటూ ఇంటికి వచ్చారు. పళ్ళు బిగించి, కళ్ళు మూసుకుని కర్రలా పడివున్న రామయ్యగారి శవం ప్రపంచంమీద కోపగించి, దాని మొహం తిరిగి చూడనని భీష్మంచుకున్నట్లు కనిపించింది. పితృవాత్సల్యం నేర్పిన భాషలో ఇందిర, కామేశం తండ్రి మరణానికి దు:ఖించారు.

పడివున్న శవానికి దహనక్రియలు ఒక ఆర్థిక సమస్యగా పరిణమించింది. నిత్యం అప్పుపై ఆధారపడి ఉన్న రామయ్యగారి కుటుంబానికి నిల్వ ధనం లేకపోవడం అసహజం కాకపోయింది. జమీందారుగారి దగ్గర తన జీతంలో ఏదైనా అడ్వాన్సు

తెస్తానంటూ ఇందిర కాళ్ళీడ్చుకుంటూ తండ్రి శవాన్ని విడిచిపెట్టి వెళ్ళింది. తన పరిస్థితులలో కానీ అప్పు తేలేనని తెలుసుకున్న కామేశం తండ్రి శవాన్ని కనిపెట్టుకు ఉండక తప్పలేదు.

## చెల్లి

పిల్లిపిల్లలా బెదురుతూవచ్చిన ఇందిరను జమీందారుగారు నవ్వుతూ ఆహ్వానించారు. ఇందిర తన కష్టాన్ని చెప్పుకుని ఏదైనా అప్పు ఇమ్మంది. జమీందారుగారు నవ్వుతూ లేచారు. ఆమె కష్టానికి సానుభూతి చూపిస్తూ మరొక నిమిషంలో ఏభై రూపాయిలు చేత్తో పట్టుకుని హుషారుగా నవ్వుతూ ఇందిరను సమీపించారు.

"ఇది అప్పుగా ఇవ్వటం లేదు. నీ కష్టాలలో సహాయం చెయ్యాలని నా సంకల్పం" అంటూ జమీందారుగారు నోట్లకట్టలు ఇందిరకు అందిచ్చారు. తల వంచుకుని ఇందిర నోట్లు లెక్కపెట్టుకుంటూంటే, దొద్దుమీసాల జమీందారు మూతి ఆమె బుగ్గలు స్పృశించింది. అవమానంతో, ఉద్రేకంతో ఉడికిపోయింది ఇందిర. జమీందారుగారి చెంప మరుక్షణంలో ఛెళ్ళుమంది. సబలుడైన జమీందారు అబల ఐన ఇందిరను కబళించాడు.

జరిగిన పరాభవానికి క్రుంగిపోతూ ఏడుస్తూ బయటికి వచ్చింది ఇందిర. సోఫాలో జమీందారు కోసం నిరీక్షస్తూ బయట కూర్చున్న శేషయ్యగారు నవ్వుతూ ఆమెవైపు అదో ఆశ్చర్యంతో చూశారు. విధిని తిట్టుకుంటూ, తండ్రి శవం దగ్గరకు తిరిగి వచ్చేసింది ఇందిర.

చెల్లెళ్ళు తండ్రి శవంకు కాపలా కాస్తున్నారు. ఆమె రాక ఆలస్యం కావడంవల్ల తనుకూడా ఎక్కడైనా అప్పు ప్రయత్నం చేద్దామని బయటికి వెళ్ళాడు కామేశం. తండ్రి మరణం, జరిగిన పరాభవం తల్చుకుంటూ కుమిలి కుమిలి ఏడ్చింది ఇందిర.

## అన్న

కాస్సేపటిలో కామేశానికి బదులు అతను పనిచేస్తున్న బట్టల మిల్లు కార్మికుడొకడు పరుగెత్తుకుంటూ వచ్చి, కామేశాన్ని జైలులో పెట్టారని చెప్పాడు.

మిల్లు యజమానిని ఏదైనా అప్పు అడుగుదామని వెళ్ళాడు కామేశం. అతని ప్రయత్నం ఫలించలేదు. యజమాని అతని కష్టాలకి సానుభూతి చూపించటం కూడా

మాని, బయటికి పొమ్మన్నాడు. కామేశం పరిస్థితుల ప్రాబల్య ఉద్రిక్తుడైపోయాడు. ప్రక్కనే మిల్లు గుమాస్తా నోట్లకట్టలు లెక్కపెడుతున్నాడు. ఆ నోట్లు ఎలాగైనా సంపాదించాలనే భావం కామేశంలో ప్రవేశించింది. హఠాత్తుగా ఆ గుమాస్తా పైకి గెంతి, అతని చేతిలోంచి వెయ్యి రూపాయల నోట్ల కట్ట చేజిక్కించుకుని పరుగెత్తాడు. కాని, పోలీసులు పట్టుకుని అతన్ని జైళ్లో పెట్టారు.

కార్మికుడు కామేశం కథ చెప్పి ఒగర్పు ఆపాడు. ఇందిరకు ఈ పరిస్థితులలో ఏం చెయ్యాలో తోచక స్తబ్దురాలై కూర్చుంది. రామయ్య గారి మంచితనాన్ని గుర్తించిన పొరుగింటి సానుభూతి పరులు కొందరు చందాలు వేసి, ఆయన శవానికి దహనక్రియలు చేయించారు.

## చెల్లి

జరిగిన సంఘటనలవల్ల, అగ్నిహోత్రం లాంటి రామయ్యగారి కుటుంబం కళంకమైపోయిందని ప్రజలు సానుభూతి చూపించారు. దొంగగా మారిన అన్నను కలుసు కుందుకు ఆలోచనల ఆయాసముతో అడుగులు వేస్తూ నడిచింది ఇందిర. రామయ్యగారి సత్కుటుంబంలో ఒక దొంగ, ఒక కులట ఆవిర్భవించారనే సంఘ దూషణలు ఆమె చెవుల్లో గింగురుమంటున్నాయి. జైలు కటకటాలలోంచి తన అన్న, జరిగినదానికి విచారించకుండా సహజమైన నవ్వుతో, ఖులాసాగా కనిపించాడు. ఇకముందైనా తప్పకుండా తమకు అదృష్టం కలగలదనే ఆశకలిగింది ఇందిరకు. అరిగిపోయిన రోడ్డుమీద, సూదుల్లా మొలచి నిలుచున్న కంకర్రాళ్ళు ఆమె పాదాలను కసితీర కరుస్తున్నాయి. కాళ్ళీడ్చుకుంటూ ఖైదీ అన్నను చూడటానికి కదిలిపోయింది ఇందిర.